క్లుప్తంగా

నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం

డీఎస్పీ నాగేశ్వరరావు



శావల్యాపురం: నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లా డుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సారథ్యంలో 34 పోలీసు స్టేషన్లలో మీతో మేము కార్యక్రమంలో భాగంగా సైబరు నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వలన జరిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం పెంపాదించటానికి వీలుగా వర్టికల్ టీవిలు ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో వర్టికల్ టీవీ సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 486 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 65 శాతం చోరీలు జరిగిన సొమ్మును రికవరీ చేశామన్నారు. నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీసు స్టేషనుల్లో సిబ్బంది కొరత భర్తీ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. వ్యాపారస్తులు, గ్రామస్తులు దాతలు సహకారంతో నేరాల నియంత్రణ చేయటానికి అన్నీ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసు అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. శావల్యాపురం పోలీసు స్టేషను పరిధిలో రికవరీ 45 శాతం ఉందని నేరాల పురోగతి బాగానే ఉందన్నారు. శావల్యాపురం సెంటరు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో ఆటోలు వలన ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లుతోందని ఇద్దరు కానిస్టేబుల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావును ఆదేశించారు. రానున్న రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థలో పెను మార్పులు వస్తాయని తద్వారా ప్రజలకు సకాలంలో న్యాయసేవలు శరవేగంగా అందుతాయన్నారు. అనంతరం రూ.40 వేలు విలువ చేసే వర్టికల్ టీవీ వితరణ చేసిన గ్రామావాసి దాత మద్దినేని హరిబాబు (సీఏ) ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయనతో పాటు రూరల్ సీఐ బి.ప్రభాకర్ రావు, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, రైటరు షేక్ బాషా పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీకి విఫల యత్నం

- సీసీ కెమెరాలు ధ్వంసం
- దుకాణ తాళాలు పగుల గొట్టిన దుండగులు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో మద్యం దుకాణంలో దుండగులు చోరీకి విఫల యత్నం చేసిన బుధవారం వెలుగు చూసింది. సేకరించిన సమా చారం ప్రకారం.. గ్రామంలోని మద్యం దుకాణంలో చోరీకి వచ్చిన అగంతకులు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం మద్యం దుకాణ తాళాలను పగుల గొట్టారు. ఉదయం మద్యం దుకాణం తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి కంగారు పడ్డారు. దుకాణంలోకి వెళ్లి పరిశీలించగా ఉండాల్సిన నగదు, మద్యం నిల్వలు అలానే ఉన్నాయి. దుండగులు తాళాలు పగుల గొట్టి దుకాణంలోకి ప్రవేశించే సమయంలో జన సంచారం రావటంతో పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి స్కూబా డైవింగ్ క్యాంప్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్



నరసరావుపేట రూరల్: వైజాగ్ నావల్ కమాండ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 17నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన స్కూబా డైవింగ్ ట్రెనింగ్ క్యాంప్‌కు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ శిబిరానికి 480 మంది క్యాడెట్స్ హాజరుకాగా మెడికల్, స్విమ్మింగ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం 110 మందిని ఎంపికచేసినట్టు తెలిపారు. కళాశాల సీనియర్ క్యాడెట్స్ డి.అప్పలనాయుడు, సి.హెచ్. మణికుమార్‌లు ఎంపికై జాతీయస్థాయి శిక్షణను పూర్తిచేసుకున్నట్టు వివరించారు. ప్రకృతి పట్ల మనకున్న కర్తవ్యాన్ని ఏ విధంగా నిర్వర్తించాలి, మానసిక ప్రశాంతతను ఏ విధంగా పెంపొందించుకోవాలి, సముద్రంలో నిక్షిప్తమైన సంపద, నిక్షేపాలు గురించి శిక్షణలో క్యాడెట్స్‌కు అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు. జాతీయస్థాయి స్కూబా శిక్షణలో పాల్గొన్న క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబులు అభినందించారు.



రెంటచింతల: కానుకమాత చర్చిలో పశువుల పాక వద్ద ప్రత్యేక ప్రార్థనలు



దాచేపల్లి: ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ కేక్ కటింగ్



మాచవరం: ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



పిడుగురాళ్ల: లూథరన్ చర్చి సందేశం ఇస్తున్న పాస్టర్



పిడుగురాళ్ల: ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

క్రీస్తులోనే నిజమైన సంతోషం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

దాచేపల్లి : క్రిస్మస్ పండగ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు పుట్టుకని జ్ఞాపకం చేసుకుంటూ..ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చిలో పాస్టర్ జీఎస్. ప్రసన్నకుమార్ క్రిస్మస్ కేక్‌ని కట్ చేశారు. నారాయణపురంలోని హోసన్నా మందిర్ క్రిస్మస్ ఆరాధనలో పాస్టర్ బాబన్న ప్రసంగించారు. ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ తగరం ప్రేమయ్య క్రిస్మస్ కేక్ కట్ చేసి, వేడుకలు జరిపించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు చర్చిల్లో మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు కేక్‌లు పంపిణీ చేశారు. శ్రీనగర్ చర్చిలో మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు క్రిస్మస్ కేక్ కట్ చేసి, వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు కేఎస్. డేవిడ్ రాజు, మోజెస్, పప్పుల జయపాల్, డేలిగేట్స్ వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య, నాగెండ్ల రత్నం, వేల్పుల ధర్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర జాల రూరల్ : క్రిస్మస్ పండగ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం దైవ సేవకులు ఏసుక్రీస్తు మహిమలను వివరించారు. చర్లగుడిపాడు, దైద, గంగవరం, పులిపాడు, తేలుకుట్ల, గోగులపాడు, గోట్టిముక్కల, పల్లెగుంత, అంబాపురం, బూదవాడ చర్చిల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయం తెలుగు బాప్టిస్టు చర్చి, ఎరుషలేం ప్రార్థన మందిరం, ది లోయల్ ఇవాంజెలికల్ ఫెలో షిప్ చర్చి, కింగ్‌డం గాస్పెల్ చర్చి, కృపామయుడు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు మహిమలను ఘన పరిచారు.

మాచవరం: క్రీస్తు పుట్టుక సర్వమానవాళికి పర్వదినం అని పాస్టర్లు వి.గురు ప్రసాదరావు, ఎం.జీవిత ప్రకాష్, రమేష్, వై.ప్రబాకర్, డేవిడ్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు జనన సందేశాన్ని వివరించారు. సర్వ మానవాళి పాప విమోచనకై దేవుని కుమారుడైన క్రీస్తు మానవునిగా జన్మించారని తెలియజేశారు. చర్చిలల్లో కేకులు కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రైస్తవులు గీతాలు ఆలపిస్తూ దేవున్ని స్తుతించారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఐలాండ్ సెంటర్‌లోని లూథరన్ చర్చి, బస్టాండ్ ఎదురుగా ఆర్‌సీఎం చర్చి, ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న హోసన్న మందిరంలో భక్తులు బుధవారం అధిక సంఖ్యలో పాల్గొని, క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు దేవుడి సందేశం ప్రజలకు వినిపించారు.

రెంటచింతల: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని అతిపురాతన మైన కానుక మాత చర్చిలో విచారణ గురువు రె.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి సహాయక గురువు ఫాదర్ అగస్టీన్‌తో కలిసి పవిత్ర సమిష్టి దివ్య పూజా బలి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఫాదర్ వెళాంగిణి మాట్లాడారు. ఏసుక్రీస్తు సూక్ష్మలైన అనిర్వచనీయమైన ప్రేమ, అపారమైన కరుణ, ఎల్లలు లేని దయ, క్షమాగుణం, అనంతమైన విశ్వాసం, శాంతి కలిగి సమాజంలో నిజమైన క్రైస్తవులుగా జీవించాలన్నారు. అర్ధరాత్రి 12గంటలకు క్రీస్తు జన్మదినాన్ని గుర్తుచేస్తూ గంటలు మోగించి, పశువులపాక వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులందరూ ఆనందాన్ని పంచుకుని ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆదివారం ఉదయం కానుక మాత చర్చిలో సహాయక గురువు ఫాదర్ అగస్టీన్, ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రె.ఫాస్టర్ డేగల దేవానందం బాల ఏసు జన్మ వృత్తాంతాన్ని, క్రిస్మస్ ప్రత్యేకతను వివరించారు.

విజయపురిసౌత్: స్థానిక ప్రముఖ పుణ్య క్షేత్రమైన సాగర మాత దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫాస్టర్ జోసెఫ్ తంబి, డీకెన్ బాల, సిస్టర్స్ పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక లూథరన్ చర్చి, గ్రామాల్లోని అన్ని చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలుపుతూ పాస్టర్లు సందేశాలిచ్చారు.



కారెంపూడిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రీస్తు బోధనలు ఆచరణీయం



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జేబీఆర్

వెల్దుర్తి: ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లూథరన్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు.నియోజక వర్గంలోని విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇతరుల పట్ల కరుణ, దయ, ప్రేమ ఉన్న వాడే నిజమైన క్రైస్తవుడు అని పేర్కొన్నారు. చర్చి పాస్టర్ కర్రా జాన్ డేవిడ్ ప్రార్థన చేసి ఎమ్మెల్యేను దీవించారు. సంఘ పెద్దలు దాసరి సుందరరావు, జక్కి పెద రామయ్య, రాయనూతల హనుమయ్య, జార్జి, ఏసోబు, యోహాను, ఆదిరాల యర్రయ్య, రత్నం పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ




దుస్తులు పంపిణీ చేస్తున్న ఫాదర్ సాగర్ బాబు

మాచవరం: మండల కేంద్రంలోని జోసఫ్ ఎంజిల్ షేర్ అండ్ కేర్ దివ్యాంగుల వృద్ధాశ్రంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బత్తుల దేవయ్య, లూర్దురెడ్డి, కిరణ్ సహకారంతో సుమారు 100 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సాగర్ మాత చర్చి ఫాదర్ రెవ.పామిశెట్టి సాగర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు కోడూరి అజయ్‌బాబు, ప్రవీణ, దేవయ్య, కిరణ్ పాల్గొన్నారు.



కారెంపూడి సెయింట్ జాన్స్‌లో క్రిస్మస్ వేడుకలు

జీవితం ఆనందమయం



క్రీస్తులోనే నిజమైన ఆనందం, సంతోషం ఉంది. ఆయన మన హృదయాల్లో జన్మిస్తే జీవితాలు ఆనందమయంగా ఉంటాయి. సాతాను పెట్టే చిక్కుల్లో పడకుండా లోక రక్షకుడు ఏసుక్రీస్తు వైపు మన హృదయాలను తిప్పితే చింతలు, బాధలు, కన్నీళ్లు, కష్టాలు తొలగిపోతాయి.

– పాస్టర్ ఎ.బాబన్న, దాచేపల్లి.

పాపుల రక్షణకు..లోక రక్షకుడు

భూ లోకంలోని పాపులను రక్షించుటకు లోక రక్షకుడు బాల ఏసు కన్య మరియమ్మకు బెత్లెహేము పట్టణంలోని ఓ పశువుల పాకలో జన్మించారు. హృదయంలో కరుణామయుడు ఏసుక్రీస్తును ప్రతిష్టించి, ఆరాధించడమే నిజమైన క్రిస్మస్. పాపాల నుంచి మానవాళిని రక్షించుటకు ఏసుక్రీస్తు ముళ్ల కిరీటం ధరించి.. ప్రపంచానికి పూలదారి పరిచారు. తాను శిలువ మోసి మరణం పొందారు.

– రె.ఫాదర్ తుమ్మా వెళాంగిణి, రెంట చింతల

క్రీస్తు జీవితం ఆదర్శణీయం

ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శణీయం. ప్రభువు మానవుడిగా మన మధ్య జన్మించిన రోజే క్రిస్మస్ పర్వదినం. క్రీస్తు సందేశాలను సమస్త మానవాళి ఆచరించాలి.

– జోసెఫ్ బాలసాగర్, విచారణ గురువు, విజయపురిసౌత్

దుర్గి: క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం ముటుకూరులోని ఆంధ్ర ఇవాంజలికల్ చర్చి, ఏఈఎల్‌సీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఏఈఎల్‌సీ అల్టర్నేట్ డెలిగేట్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించట అని అన్నారు. ఆంధ్ర ఇవాంజలికల్ చర్చి పాస్టర్ రెవ.కటికల ఏసుదానం దైవ సందేశమిచ్చారు. కోట మోషే, కోట రాజు, బీర్నిడి మీరయ్య, కందుకూరి దాసు, శివ, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు గుండెల్లో తుఫాన్

- కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వర్షాలు
- మొలకలు వస్తున్న వరి కుప్పలు
- నష్టాన్ని అంచనా వేసే నాథుడే కరువయ్యారంటూ ఆవేదన



జంగమహేశ్వరపురంలో టర్ఫాలిన్ పట్టపై నిలిచిన వర్షపు నీరు



కల్లంలో ధాన్యంపై పట్టలు కప్పిన రైతులు

గురజాల : విపత్తుల సమయంలో పంట నష్టాలను పర్యవేక్షించి, నష్టాన్ని ప్రభుత్వం అధికారులతో లెక్కలు వేయిస్తుంది. అయితే ప్రస్తుతం గురజాల నియోజకవర్గంలో కోత కోసి, ఆరబెట్టిన వరి ధాన్యం మొత్తం వర్షపు నీటిలో తడిసిపోయింది. గత మూడు రోజుల క్రితం దాచేపల్లి మార్కెట్ యార్డులో ఆరబోసిన వరి ధాన్యం కూడా తడిసి పోయింది. గురజాల, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో అరబెట్టిన ధాన్యానికి కూడా ఇదే పరిస్థితి. వరి పైరు నేలకొరిగి ఎందుకు పనికిరాకుండా పోయాయి. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి గ్రామాల్లో రైతుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపించేశారు. రైతులను ఆదుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుత పభుత్వం ,అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదని రైతులు వాపోతున్నారు.

రైతుల బాధ వర్ణానాతీతం

టార్పాలిన్ పట్టలు సరిగ్గా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న టార్పాలిన్ పట్టలు తీసుకుని వెళ్లి పంటను కాపాడుకోవల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

గతంలో వచ్చిన రెండు తుఫాన్‌లను తట్టుకుని ముందుకు సాగిన రైతులకు గత మూడు రోజులుగా కురుస్తున్న మూడో తుఫాన్‌కి మాత్రం కల్లాల్లో ధాన్యం అక్కడక్కడ తడిసినట్లు చెబుతున్నారు.



యార్డులో ధాన్యం బస్తాలను భద్రం చేసిన రైతులు

వర్షాలతో ఇక్కట్లు



నడికుడి మార్కెట్ యార్డులో . ధాన్యంపై కప్పిన పట్ట మీద వర్షపు నీరు



కారెంపూడిలో ధాన్యంపై కప్పిన పట్టలపై నిలిచిన నీరు

దాచేపల్లి : తుపాను రైతులను భయాందోళనకు గురిచేస్తోంది. శనివారం నుంచి వర్షం దశల వారీగా కురుస్తోంది. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫాంపై రైతులు ధాన్యం ఆరబోశారు. వర్షానికి తడవకుండా రాశులపై టార్పాలిన్ పట్టలు కప్పారు. మరికొందరు ధాన్యాన్ని బస్తాల్లో నింపి, భద్రం చేసుకున్నారు. వర్షాలకు అదనపు ఖర్చులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 13 మంది అరెస్ట్
- రూ.7.57 లక్షలు నగదు 11 సెల్ ఫోన్‌లు స్వాధీనం



పట్టుబడిన జూదరులతో సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ అమీనుద్దీన్

సత్తెనపల్లి: రహస్యంగా పేకాటాడుతున్నారని అందిన సమాచారం మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాల సమీపంలో ఖాళీగా ఉన్న గృహంలో 13 మంది రహస్యంగా పేకాటాతున్నారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి టౌన్ సీఐ బి.బ్రహ్మయ్య నేతృత్వంలో సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమినుద్దీన్, సిబ్బంది దాడులు నిర్వహించారు. 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.7.57 లక్షలు నగదు, 11 సెల్ ఫోన్‌లు స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మెడలో బంగారు చైను చోరీ

ఈపూరు (శావల్యాపురం): మండల కేంద్రం ఈపూరులో వృద్ధురాలి మెడలో బంగారు చైను లాక్కొని పోయిన సంఘటన చోటుచేసుకున్నట్లు ఎస్సై యం. ఉమామహేశ్వరావు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన గుంటకల పేరమ్మ వృద్ధురాలు తన ఇంటిలో గత నాలుగు రోజుల నుంచి టీవీ ప్రసారాలు రావటం లేదని సాయిరామ్‌కు సమాచారం ఇచ్చింది. ఇదే అదునుగా భావించి పక్కనే ఉన్న మంచపై వృద్ధురాలిని నెట్టి ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు చైను లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనపై గుంటకల పేరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు అయ్యప్ప పడిపూజ మహోత్సవం

పాలువాయి(రెంటచింతల): పాలువాయి గ్రామంలో శుక్రవారం అయ్యప్పస్వామి పడిపూజ మహోత్స వం నిర్వహించనున్నట్లు గురుస్వామి బద్దూరి బ్రహ్మానందరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు 18 మెట్ల కలశ పూజ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నర్సరావుపేటకు చెందిన కృష్ణ ఆర్కెస్ట్రాతో అయప్ప నామ సంకీర్తన జరుగుతుందని తెలిపారు. రాత్రి 10 గంటలకు స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిగుండం ప్రవేశం ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ స్వాములు, భక్తులు పాల్గొనాలని తెలిపారు.

నూజెండ్లలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ప్రధాన కూడలి మార్గంలోని రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు ఐక్యంగా ఇరుకుగా ఉన్న రహదారి మార్గంలో ఆక్రమణలు తొలిగింపు పనులు పూర్తి చేసిన అనంతరం సెంట్రల్ డివైడరు లైటింగ్‌తో పాటు ఇరువైపులా సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు చేశారు. ఏఈ అల్లాభక్షు మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకం నిధులు రూ.30 లక్షల వ్యయంతో 220 మీటర్ల మొర సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. మరెన్నో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

ముగిసిన హనుమాన్ చాలీసా



పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో ప్రసన్నాంజనేస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 11 వారాల నుంచి హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కోశాధికారి భవరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. రెండేళ్ల నుంచి ప్రతి మంగళవారం భజన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముగింపు సందర్భంగా మహిళలకు చీర, సారె పంపిణీ చేశారు. భక్తులు పాల్గొన్నారు.

మనుస్మృతి దహనంపై అవగాహన ఉండాలి

క్రోసూరు: మనుస్మృతి సమాజంలో ఎన్ని రకాలుగా అరాచకాలు చేసిందో ప్రజలందరూ తెలుసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి గౌరవ చైర్మన్ గార్లపాటి దాసు బుధవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా తగులు పెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఊపిరి పోశాడన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రతులను తగులు పెట్టిన రోజు డిసెంబర్ 25 రోజు అని అన్నారు.